# గీతాంజలి

గీతాంజలిలో ఇదే నా మొదటిసారి ప్రయాణం. ఈ మధ్యనే కదూ ఈ సూపర్‌ఫాస్ట్ ట్రైన్స్ వచ్చాయి!

ప్లాట్‌ఫామ్ మీదికి రాగానే నన్ను ఆకర్షించింది ఆ ఇద్దరు అమ్మాయిలూ, ఇద్దరు అబ్బాయిలూ. వాళ్ళూ అప్పుడే వచ్చి నిలబడ్డారు.

వెంటనే ఏ అబ్బాయి, ఏ అమ్మాయికి భర్త అయి ఉంటాడోనని కొంచెంసేపు ఊహించబోయాను కానీ, ఏమీ తేలలేదు.

వాళ్ళు నలుగురూ చాలా చేరువగా, చనువుగా వున్నారు. ఎవరు ఏ రాష్ట్రానికి చెందినవాళ్ళో తెలియటం లేదు. ఇంగ్లీషులో అఘోరిస్తున్నారు సంభాషణలు.

అది అమెరికన్ యాస కాబోలు 'యార్ హాయ్ మాన్' అనుకుంటూ.

ఏభై ఏళ్ళు దాటిన నేను ముసలాడినని ఒప్పుకోక తప్పదు.

ఎంతగా ఈ కాలం మార్పుల్ని, ఆలోచనల్ని అర్థం చేసుకుందామని ప్రయత్నించినా వీళ్ళ ప్రవర్తన ఎబ్బెట్టుగా, అసభ్యంగానే కనిపిస్తుంటుంది నాకు.

వాళ్ళు కనీసం అన్నాచెల్లెళ్లు కాదు. చుట్టరికం కూడా లేదు. చదువువల్లనో, ఉద్యోగంవల్లనో కలిసిన స్నేహం వాళ్ళ మధ్య ఉండి ఇట్లాగ కలిసి ప్రయాణం చేస్తున్నారని గ్రహించినప్పుడు నాకు ఆ నలుగురిమీద చులకనభావం ఏర్పడిపోయింది. దానితోబాటు కుతూహలం కూడా ఉందని ఒప్పుకోక తప్పదు.

అందరం ట్రైన్ కోసం ఎదురు చూస్తున్నాం.

ఇంకా పావుగంట ఉంది.

ఆ ఇద్దరమ్మాయిల్లో తెల్లగా, పీలగా ఉన్న అమ్మాయి టీ అడిగింది.

కొంచెం దక్షిణాది యాసతో మాట్లాడుతున్న కుర్రాడు వెళ్ళి టీ స్టాల్‌నించి ఒక కప్పు టీ తీసుకొచ్చాడు. ఆ పిల్లకి అందించాడు. గుండ్రంగా చేపల్లాంటి కళ్ళు.

బెంగాలీ యేమో! ఆ పిల్ల తెల్లగా ఉందన్న మాటేకానీ నాకసలు నచ్చలేదు. మొహంలో జీవం లేదు. వొంట్లో కండా, రక్తం లేనట్లుగా వుంది. వేషం మాత్రం ఫారిన్ మేగజైన్‌లో మోడల్‌లాగ జీన్స్ వేసుకుంది. జుట్టు ఎత్తి పైకి కట్టుకున్నా పక్కన జూలు వేలాడుతోంది.

రెండవ అమ్మాయి చామనచాయలో వుంది. చాలా సింపుల్‌గా వుంది. వొదులుగా కుర్తా వేసుకుంది. అందగత్తె అనటానికి లేదుగానీ ఆ పిల్ల కళ్ళు కదులుతుంటే మెరుపులు కురుస్తున్నట్లుగా వుంది. ఏదో ఆకర్షణ వుంది.

తెల్లగా పార్శీవాడేమో అనిపించేట్టు వున్న రెండో కుర్రాడు ఆ అమ్మాయితో ఏదో చెప్తున్నాడు. వాళ్ళిద్దరూ చాలా దగ్గరగా వున్నారు. ఆ పిల్ల అబ్బాయి కళ్ళలోకి చూస్తోంది. మాట్లాడుతూ ఆ పిల్ల భుజం మీద చెయ్యివేశాడా అబ్బాయి. ఆ అమ్మాయి అట్లాగే నవ్వుతూ ఏదో చెప్తోంది.

''వీళ్ళిద్దరి మధ్యా స్నేహం ప్రేమలోకి దిగింది కాబోలు! త్వరలో పెళ్ళిచేసుకుంటారేమో! బాగానే ఉంది కదా! ఈ కాలం వాళ్ళకి చక్కగా ఒకరినొకరు అర్థం చేసుకుని పెళ్ళి చేసుకునే అవకాశం ఉంది. పెళ్ళయిన తర్వాత సుఖంగా సంసారం చెయ్యగలరు'' అనుకున్నాను.

ఆ తెల్లపిల్ల టీ సగం తాగిందో లేదో కప్పు అరవ కుర్రాడికి అందించింది.

పారబోస్తాడేమో అనుకున్నాను. తాగటం మొదలెట్టాడు.

అందుకే అన్నాను. ఈ కాలం పిల్లల వేషాలు వెగటు పుట్టిస్తాయని.

వాడు సగం తాగి ''సునీ తాగుతావా?'' అంటూ రెండో పిల్లకి అందించాడు.

ఆ పిల్ల తల అడ్డంగా ఊపింది ''వద్దు'' అన్నట్లు.

నాకు ఈ సునీ అన్న పిల్ల నచ్చుతోంది. కాకుల మధ్య హంసలాగ, దొంగలమధ్య యోగిలాగ! ఆ పిల్ల వద్దనగానే పార్శీ కుర్రాడు అందుకుని తాగేశాడు.

కప్పు తీసికెళ్ళి టీ స్టాల్లో యిచ్చాడు.

ఇప్పటిదాకా ఆ బెంగాలీ పిల్ల దగ్గరున్న అరవ కుర్రాడు సునీ దగ్గరకి వచ్చాడు. చెయ్యి పట్టుకుని వాచ్ చూశాడు. ఆ పిల్ల నవ్వుతూ వాడితో ఏదో అంది. వాడు ఆ పిల్ల వీపుమీద ఒకటి కొట్టాడు. ఏమీ అనలేదా పిల్ల. నవ్వుతూనే వుంది. ఈ పిల్ల ఏదో మంచిది, మడి కట్టుకుంది అనుకున్నాను. ఇద్దరితోటీ సరసాలాడుతోంది!

పార్శీ కుర్రాడు తిరిగి వచ్చి తెల్లపిల్ల దగ్గర చేరాడు.

అది పాకెట్‌లోంచి సిగరెట్ తీసింది. వీడు లైటర్ తీసి అంటించాడు. ఆ పిల్ల రెండుసార్లు పొగపీల్చి వదిలింది. తరవాత వాడికిస్తే వాడు తాగటం మొదలుపెట్టాడు. వీళ్ళ ప్రవర్తన మామూలుగా లేదు. భిన్నంగా ఉంది.

వీళ్ళ ఉద్దేశం ఏమిటి? చాలా ఆధునికంగా, అమెరికన్‌లలాగ ఉండాలన్న క్రేజా?

ఉద్యోగాలు చేస్తున్నంతమాత్రాన ఇహలోక సమస్యలకి అతీతులమై పోయామనుకుంటున్నారా? ఆడ, మగ భేదానికతీతమైన స్నేహాన్ని రుజువు చేస్తున్నారా?

ఒకళ్ళ ఎంగిలి ఒకళ్ళు తింటూ జాతి మత భాషా భేదాల కతీతంగా వుండాలని ప్రయత్నిస్తున్నారా? వీళ్ళు వాళ్ళ ఇళ్ళలో వున్నప్పుడు తల్లిదండ్రుల ఎదుట కూడా ఇట్లాగే వుంటారా? అంత మోడరన్ ఫామిలీసా వీళ్ళవి?

ఏదో పని వంకన, ఉద్యోగరీత్యా బయటికి వచ్చినప్పుడు అణిచిపెట్టిన సరదాల్ని తీర్చుకుంటూ విపరీతమైన స్వేచ్ఛ ప్రదర్శిస్తున్నారా?

ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తోంది. దూరంగా లైటు కనిపిస్తోంది. రైలు చప్పుడు వినిపిస్తోంది. వచ్చేస్తోంది గీతాంజలి.

నా సూట్‌కేస్ పట్టుకుని రిజర్వ్‌డ్ బోగీ కేసి వెడుతున్నాను. వెనక్కి తిరిగి చూశాను. తెల్లపిల్ల, పార్శీవాడు కూలీచేత సామాను పట్టించుకుని ముందర వస్తున్నారు. అరవ్వాడు సునీ నడుంమీద చెయ్యివేసి నడిపించుకుని వస్తున్నాడు.

''ఈ రైలు ఎటైనా పోనీ నేను మాత్రం నిన్ను వదలను'' అంటున్నట్లున్నాడు.

ఒకవేళ వీళ్ళిద్దరూ ప్రేమించుకున్నారేమో! ఇందాక నేను పొరపాటుపడ్డాను అనిపించింది. వీళ్ళిద్దరి చూపుల్లో నవ్వుకోవటంలో ఇంకా ఇంటిమెసీ వుంది. ఆ తెల్లకుర్రాడు స్నేహితుడుకదా అని మంచిగా మాట్లాడుతోంది.

కంపార్టుమెంట్‌లోకి ఎక్కి జనాన్ని తప్పించుకుంటూ నా సీటుచేరి సామాను సర్దుకునేటప్పటికి పావుగంట పట్టింది. నాకు పై సైడ్ బెర్త్ దొరికింది.

ఆ నలుగురూ కూడా వాళ్ళసీటు వెతుక్కుంటూ నాకు ఎదురుగా ఉన్న బెర్తుల దగ్గరకి వచ్చారు. సగంలో ఆగిపోయింది కథ! అనుకున్న నాకు సంతోషం వేసింది.

వీళ్ళ సంగతి తేలకపోతుందా అనుకున్నాను.

వాళ్ళు సీట్లు చూసుకున్నారు. సామానంతా ఒక సీటుమీద పడేసి ఇంకెక్కడా చోటులేనట్లు ఆ నలుగురూ ఒకే బెర్త్‌మీద మీద కూచున్నారు ఒకళ్ళ నొకళ్లు తాకుతూ

మళ్ళీ నాకనిపించింది - వీళ్ళకి జంకు లేదా? ఎవరైనా ఏమైనా అనుకుంటారని! అందరూ చూస్తున్నారని!

నలుగురూ మగపిల్లలైతే ఎట్లా వుంటారు? అట్లా వున్నారు.

సెండాఫ్ చెయ్యటానికి వచ్చిన జనం దిగిపోయి నిలబడ్డారు.

లోపల రష్ తగ్గింది. అప్పుడు చూశాను. నా పక్కనే ఒక అమ్మాయి నిలబడి వుంది. ఆ అమ్మాయి తండ్రి కాబోలు పలకరించాడు ఇంగ్లీషులోనే.

"ఈ పై బెర్త్ మీదా? ఈ క్రింది బెర్త్ మా అమ్మాయిది. కూర్చోండి ఫరవాలేదు. నాకు ఆ పై బెర్త్ దొరికింది. మీకు మార్చుకోటానికి వీలౌతుందా? మా అమ్మాయికి దగ్గరగా వుంటాను' అన్నాడు.

ఒప్పుకున్నాను. గీతాంజలి కదిలింది. కదులుతూనే వేగం అందుకుంది.

నేను అతడితో మార్చుకున్న పై బెర్త్ ఆక్రమించుకున్నాను. అక్కడి నుంచి క్రింద సీట్లన్నీ బాగా కనిపిస్తున్నాయి. ఇంటి దగ్గర భోజనం అయింది. ఇంక నిద్రపోవటమే. అప్పుడే నిద్ర ఎక్కడ వస్తుంది!

ఆధునిక చతుష్టయం ఏం చేస్తున్నారో అన్న కుతూహలంతో దృష్టి అటు మళ్ళించాను. అరవ కుర్రాడు సునీ భుజం చుట్టూ చెయ్యివేశాడు.

ఆ పిల్ల వాడివైపు మొగ్గి పార్శీ కుర్రాడితో కబుర్లు చెప్తోంది నవ్వుతూ ఏ మాత్రం బెదురులేకుండా. అట్లాగ ఆనుకుని కూచోటం అలవాటు అయినదానిలాగ. ఆ నవ్వులో ఆకర్షణ వుంది. మంత్రించే గుణం వుంది. పార్శీ కుర్రాడు ఆ నవ్వు తాగేస్తూ ఆ పిల్ల కళ్ళలోకి చూస్తున్నాడు.

అరవ కుర్రాడు ట్రాన్సెండెంటల్ మెడిటేషన్‌లోకి వెళ్ళిపోయినట్లు పూర్తిగా కళ్ళు మూసేసుకున్నాడు. తెల్లపిల్ల మాత్రం శ్రద్ధగా వింటూన్నట్లు ముందుకి వంగింది. మధ్య మధ్య జవాబులిస్తోంది సునీకి. ఏమిటో అన్ని సంగతులు! అట్లాగ వాడిని ఆనుకుని కూర్చుందంటే తప్పకుండా వాళ్ళిద్దరికీ ఎంగేజ్‌మెంట్ అయి వుంటుంది. లేకపోతే ఎంత స్నేహమైనా ఏ ఆడపిల్లా ఇంత ఫ్రీగా వుండదు ఒక మగవాడితో. తప్పకుండా వీళ్ళిద్దరూ పెళ్ళిచేసుకో బోతున్నారు అనుకున్నాను.

అట్లాగనుకుంటే నాకు తృప్తిగా ఉంది. ఏదో బాధ తీరిపోయింది.

మరి యువత ఇట్లాగ బరి తెగించటం బాధకదూ.

ముసలాడిని నాకే ఇట్లాగ ఉంది కదూ. వయసులో ఉన్న పిల్ల. వీళ్ళ ప్రవర్తన ఆ అమ్మాయికెట్లాగ ఉందోనని సైడ్ బెర్త్‌వైపు చూశాను.

ఆ అమ్మాయి చాలా బుద్ధిమంతురాలిలాగ ఉంది.

వీళ్ళవైపు చూడటంలేదు. ఏదో ఇంగ్లీషు మేగజైన్ చదువుతోంది. చీరలో పిల్ల సింపుల్‌గా ఉంది. కానీ చక్కగా కూడా ఉంది. ఆ ఇద్దరమ్మాయిల కంటె కూడా బాగుంది. కాని ఎక్కడా విరగబాటు కనిపించటం లేదు.

తండ్రి అప్పుడే నిద్రలోకి దిగిపోయాడు. గీతాంజలి బాగా ఫాస్ట్‌గా పోతోంది. గంటకి అరవై మైళ్ళు కాబోలు వేగం.

తెల్లపిల్ల కెవ్వుమనటంతో అటు తిరిగాను.

కంట్లో నలకపడింది కాబోలు చేతితో కన్నుమూసుకుంది.

ఇద్దరు కుర్రాళ్ళూ ఒక్కసారే లేచారు. పార్శీ కుర్రాడు షట్టర్ వేశాడు.

అరవకుర్రాడు ఆ పిల్ల చెయ్యిపట్టుకుని లేపి వాష్‌బేసిన్ దగ్గరికి తీసికెళ్ళాడు.

ట్రైన్ వేగానికి బాలెన్స్ కుదరక ఎవరు నడిచినా తాగి తూలుతున్నట్లు ఉంది. వాళ్ళిద్దరూ డాన్స్ చేస్తున్నట్లుగా అనిపిస్తోంది.

ఆ పిల్ల నీళ్ళతో కళ్ళు కడుక్కుంది. ''పోయిందా?'' అని అడిగాడు.

కళ్ళు తెరిచి చూసి నవ్వింది. టవల్‌తో ఆ పిల్ల మొహం, మెడ అద్దాడు. ఎంత షివల్రీ... అవకాశం వుంటే అబ్బాయిలు అమ్మాయిల్ని ఎంత చక్కగా ఆదరిస్తారు! ఈ అవకాశం లేకనే టీజ్ చేస్తారు కాబోలు!

కొత్త అమ్మాయి ఒకసారి పుస్తకం తీసి వాళ్ళని చూసి తనలో తను నవ్వుకుంది.

ఆ ఇద్దరూ వచ్చి కూర్చున్నారు ఇదివరకు చోట్లోనే.

''నాకు ఆకలేస్తోంది!'' అంది సునీ.

పార్శీకుర్రాడు ఒక డబ్బాతీసి అందులోంచి కచోడీలు, స్వీట్స్ తీసి ఒక ప్లేట్‌లో పెట్టి అందించాడు. తెల్లపిల్ల తీసుకు తింటోంది. సునీ తీసుకోలేదు. అరవ కుర్రాడు ఒక స్వీటు తీసి సునీ నోటికి అందించాడు. ఆ పిల్ల స్వీట్ కొరికి చేతిలోకి తీసుకుంది. అప్పుడు ఇద్దరు అబ్బాయిలూ తినటం మొదలుపెట్టారు.

ఈ ఇద్దరబ్బాయిలూ సునీనే ఆరాధిస్తున్నారు. ఆ తెల్లపిల్లకి ఎక్కడా కోపం వస్తున్నట్లు లేదు. తనని నెగ్లెక్ట్ చేస్తున్నారని! సునీమీద జెలసీ వున్నట్లు లేదు.

ఏమిటీ పిల్ల సునీ! వీళ్ళందరినీ తన చుట్టూ తిప్పుకుంటోంది.

ఆ పిల్ల దగ్గర ఏముంది! ఎదుటి మనిషిని మంత్రించే ఆ శక్తి ఏమిటి

యౌవనాన్ని మించిన మంత్రశక్తి ఏముంది ఈ సృష్టిలో.

దాన్ని వాడుకోవటం చేతనైతే ఎంతటి మాయాజాలాన్నైనా అల్లవచ్చు. కానీ యౌవనాన్ని యథేచ్ఛగా వాడటం ఎంత వరకూ మంచిది! అది నిప్పులాంటిది! అవసరాన్నిబట్టి చెయ్యి, వేళ్ళు కాలకుండా కార్యసాధన జరగాలి. వీళ్ళు నిప్పు దగ్గర సెగ కాచుకుంటున్నారా? నిప్పులో దూకటానికి సిద్ధమౌతున్నారా? తినటం అయ్యాక పక్కలు సర్దుకోవటం మొదలుపెట్టారు.

అమ్మాయిలిద్దరికీ పక్కలు వేశారు. తమ పక్కలు పరుచుకున్నారు.

తెల్లపిల్లకింద బెర్త్‌మీద పడుకుంది. సునీ మధ్య బెర్త్ మీదికి ఎక్కుతుంటే చెయ్యి అందించి నడుం పట్టుకుని ఎక్కించాడు పార్శీవాడు చిన్నపిల్లని ఆదరించినట్లు! ఎక్కి పడుకుని దుప్పటి గుండెలమీదికి లాక్కుంది. కాళ్ళకి పట్టాలున్నాయి.

తెలుగుపిల్లా! కాళ్ళపట్టాల్నిబట్టి అనుకోటానికి లేదు. ఒకచోట ఫ్యాషనయితే ఇప్పుడు దేశమంతా అదే అనుకరిస్తున్నారు.

ఐనా ఆ మొహం చూస్తుంటే తెలుగుపిల్లేమో అనిపిస్తోంది.

కుర్తా వదులుగా ఉన్నా, శరీరంమీద యౌవనపు బరువు తెలుస్తూనే ఉంది.

లోకాన్ని విప్పార్చుకుని చూస్తున్నట్లున్న కళ్ళు.

జీవితం ఎంత తీయనైనదీ! అంటున్నట్లు భ్రమలో ఈదుతున్న కళ్ళు.

మీకు తెలియని రహస్యాలెన్నో నేను రుచి చూశాను అని గేలి చేస్తున్నట్లున్న కళ్లు.

ఆ అబ్బాయిలిద్దరూ ఆ అమ్మాయి చుట్టూ తిరగటంలో ఆశ్చర్యం లేదనుకున్నాను! ఆ అమ్మాయి వున్నచోట నేనూ బ్రతుకుతుంటే నేనూ అట్లాగే చేసేవాడిననిపించింది. అది యౌవనపు మైకం కావచ్చు.

అరవ పిల్లవాడు కాళ్ళ దగ్గర దుప్పటి సరిచేశాడు.

ఇంకా ఆ పిల్లని వదిలి నిద్రపోవాలనిపించటం లేదు కాబోలు. పార్శీ కుర్రాడు నిలబడే మెల్లగా ఏదో అంటున్నాడు.

నవ్వుతూనే ''నాకు నిద్రవస్తోంది'' అంటూ కళ్ళు మూసుకుంది.

తలమీద చెయ్యి వేసి జుట్టు సవరించాడు. ఆ పిల్ల ఏమనలేదు. కదలలేదు. భుజం ఒకసారి గట్టిగానొక్కి వదిలేసి బాత్‌రూమ్‌వైపు వెళ్ళాడు.

క్రింది బెర్త్‌లో అమ్మాయి అట్లాగే దీక్షగా పుస్తకం చదువుతోంది. ఇంగ్లీ నవల. కళ్ళ ఎదుట ఈ ప్రదర్శనకంటె ఆసక్తికరంగా ఉందా ఆ నవల!

అట్లా వాళ్ళకేసి చూడటం మోడెస్టీ కాదనుకుని పుస్తకం చా చేసుకుందా?

ఏమైనా ఒప్పయిన పిల్లలాగుంది.

తన ఈడుపిల్ల కదా, ఆ సునీ పలకరించి మాట్లాడకూడదూ ఈ పిల్లతో ఎట్లాగైనా తెలుగుపిల్లలు అంత బరితెగించరు. చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తారు అట్లా అనటానికి లేదు.

సినీరేఖా తెలుగు పిల్ల కాదూ! నలుగురి నోళ్ళలోనూ నానలేదూ!

చలంగారి రాజేశ్వరి తెలుగు ఆడబిడ్డ కాదూ?

కామానికీ, కరుణకీ మధ్య చిక్కి సంకెళ్ళు తగిలించుకోలేదూ?

ఈ పిల్ల కూడా జీవితంతో ఎక్స్పెరిమెంట్ చేస్తోందా?

ఫేషన్‌కోసం వీళ్ళతో ఆటలాడుతోందా?

తన అవసరాలకోసం వాళ్ళని వాడుకుంటోందా?

రైల్లోనే ఇంత స్వేచ్ఛ ప్రదర్శిస్తున్నారు. ఇంక ప్రైవసీ వుంటే వీళ్ళు ఏం చేస్తారో?

జామ్ సెషన్స్‌కి, పాట్ పార్టీలకి తిరుగుతుంటారేమో.

ఇవేళ ఇట్లాగ వీళ్ళతో తిరుగుతే రేపు ఈ పిల్లకి పెళ్ళి అవుతుందా?

బంగారంలాంటి పిల్ల.

ఇట్లా తిరిగి సరదాలు తీర్చుకుంటున్న ఈ ఇద్దరు మగపిల్లల్లో ఒకరేనా సునీని పెళ్ళిచేసుకోటానికి ముందుకి వస్తారా? రారు! మధువు పీల్చేసిన తుమ్మెదల్లాగ ఎగిరి వెళ్ళిపోతారు.

ఆ పార్శీకుర్రాడు చేసుకుంటాడేమో! అతడికి పట్టింపు ఉండదనిపిస్తోంది. ఈపిల్ల నిజంగా గడుసుదేమో. వాళ్ళని అట్లాగ ఆడిస్తోందేమో! దూరంగానే ఉంచుతుందేమో.... నిజమైన అనుభవాలు పంచిపెట్టకుండా.

పడుకున్న వెంటనే నిద్రపోయినట్లుంది సునీ కదలటం లేదు.

తెల్లపిల్ల అటూ-ఇటూ కదులుతూనే ఉంది. అబ్బాయిలిద్దరు పైకి ఎక్కి పడుకున్నారు. ఒక్కొక్కరే నిద్రలోకి జారుకున్నారు.

''ఇంక పడుకో తల్లీ! ఆ లైటు ఆర్పెయ్యి'' అన్నాడా పై బెర్త్ జంటిల్‌మేన్. తెలుగువాళ్ళేనన్నమాట.

అందుకే అంత కుదురుగా ఉంది. ఇద్దరబ్బాయిలు ఎదుట ఉంటే ఎన్ని వయ్యారాలేనా పోవచ్చు. పుస్తకం పెట్టేసి దుప్పటి కప్పుకుని పడుకుంది.

నేను లేచేటప్పటికి ఆ తండ్రీ, కూతురూ లేచారు. ఆ అమ్మాయి మొహం కడుక్కుని చక్కగా బొట్టు పెట్టుకుంది. కిటికీ బయటికి చూస్తోంది.

ఆధునిక చతుష్టయం ఇంకా లేవలేదు నిద్రలోంచి.

గీతాంజలి ఆగకుండా వేగంగా పరిగెడుతోంది. కాఫీ తాగాను.

ముందర అరవకుర్రాడు లేచాడు తెల్లపిల్ల కదులుతోంది.

''టీ తాగుతావా'' అనడిగాడు తల ఊపి లేచి కూచుంది.

ఇద్దరూ కలిసి బల్ల దింపారు. కూర్చున్నారు. మొహం కడుక్కోకుండానే టీ సేవించారు. ఈసారి ఎవరి కప్పుల్లో వాళ్ళు తాగారు.

వచ్చేదే నాగ్‌పూర్ స్టేషన్. నేను దిగిపోవాలి.

ఆ తండ్రీ, కూతురు ఎక్కడ దిగుతారో?.... అడిగాను.

''మేమూ నాగ్‌పూరే! వరసకి నాకు చెల్లెలవుతుంది. ఆవిడ కొడుక్కి ఇస్తున్నాం మా అమ్మాయిని. అమెరికా నించి ఈమధ్యే వచ్చారు'' అన్నాడు తెలుగులో. ఐతే ఈ పిల్లకి పెళ్ళి నిశ్చయమై పోయిందన్నమాట!

హృదయం కాళీ లేదు. కనకనే ఆ అబ్బాయిలు ఇటు చూసినా చూపులు కలపటం లేదు. వయసు రాగానే పెళ్ళి చెయ్యాలి. ఎగిరే పటానికి పగ్గం తగిలించాలి.

లేకపోతే ఇట్లాగే పిచ్చిపిచ్చి వేషాలు వేస్తారు.

అదిగో పార్శీకుర్రాడు లేచాడు. దిగుతున్నాడు. ఊరుకోకూడదూ. సునీని కుదిపి కుదిపి లేపుతున్నాడు. కళ్ళు తెరిచి నవ్వింది. వాచ్ చూసుకుంది. లేచి కూచుంది. ఆ అబ్బాయి చెయ్యి అందిస్తే కిందికి దిగింది. ఏం వయ్యారం! ఒకసారి వొళ్ళు విరుచుకుంది శిల్పానికి ప్రాణం వచ్చినట్లు!

''టీ తాగు'' అన్నాడు అరవ కుర్రాడు. టీ పాట్ చూపిస్తూ.

''మొహం కడుక్కువస్తా'' బాత్‌రూం వైపు వెళ్ళింది. అవినీతిలోనూ నీతి వున్న పిల్ల!

మళ్ళీ నలుగురూ ఒకరిపక్కన ఒకరు చేరారు. సునీ పక్కన కూచున్న అరవ కుర్రాడు సునీ వొళ్ళో చెయ్యివేసి మాట్లాడుతున్నాడు... తన స్వంతం అయినట్లు!

వొళ్ళు మండుతోంది నాకు. వాళ్ళు అట్లాగ ఒకళ్ళనొకళ్ళు తాకుతుంటే నా సామ్మేదో పోయినట్లే ఉంది నాకు. ఉమ్మడి నీతిని మంట కలుపుతున్నారు మరి!

అంత దగ్గరగా.... ఆడా, మగా భేదం లేకుండా. వీళ్ళు చెయ్యని చేష్ట ఒకటే! ముద్దులు పెట్టుకోవటం! ఇంకా అంతకి తెగించలేదు ఎందుకో!

పాసెంజర్స్ అభ్యంతరపెడతారనా? వాళ్ళేం చేస్తారు పిచ్చి సన్నాసులు. వెర్రిమొహాలు వేసుకుని చూడడం తప్పు! ఐనా వాళ్ళకి అభ్యంతరం ఉండకూడదుకదా. పరిధులూ, పంజరాలూ లేని అతి నాగరక జీవులు!

పాతకాలం వాళ్ళం! మూర్ఖులం! పెళ్ళి అంటూ బాధ్యతలూ, బంధాలూ పెంచుకుని సుఖమనేది లేకుండా, జీవితాన్ని దుఃఖమయం చేసుకుని ఈదుతున్నాం. కనీసం ఫామిలీ ప్లానింగ్ కూడా తెలీదు. వీళ్ళకి అన్నీ అందుబాటులో వున్నాయి. ఇంక పెళ్ళెందుకు? పిల్లలెందుకు?

ఆఁ ఇప్పుడర్థమయింది నాకు. వీళ్ళు పెళ్ళి చేసుకోరు! చేసుకున్నా వాళ్ళకి అభ్యంతరాలుండవు శీలం గురించి. సుఖపడ్డారు! ఈ శీలం గురించేకదా హత్యలూ' ఆత్మహత్యలూ జరుగతుంట.

దేవతల్లాగ స్వేచ్ఛగా తిరుగుతారు.

ఊహుఁ! అది నిజం కాదు. మనిషికి ఎన్ని ఉన్నా తన ఇల్లు, భార్య, పిల్లలూ అంటూ వుండకపోతే తృప్తి, శాంతి వుండవు. అట్లాగ తనది అంటూ ఒక ఇల్లు ఏర్పరచుకోవటం మనిషి ప్రాథమిక అవసరం! స్వేచ్ఛ పేరుతో దానికి వ్యతిరేకంగా, స్వభావానికి దూరంగా వెళ్ళిపోతే మనిషికి తృప్తి వుండదు. అది విపరీతానికి దారి తీస్తుంది. మనిషి మనుగడకి ముప్పు తెస్తుంది.

ఈ పిల్లలు, అదే నాగరికత అనుకుని భ్రమలోపడి, మంచీ చెడూ లేక పరిధి దాటుతున్నారు. వీళ్ళకి ఎట్లా చెప్పటం, పాపం! ఇదే నా కూతురైతే ఇట్లాగ ఊరుకుంటానా? ఈ సునీ తల్లిదండ్రులెవరో! అడగాలనిపిస్తోంది. ఎడ్రస్ తీసుకుని ఆ తండ్రికి ఉత్తరం రాస్తాను. ఎవరికి ఎవరం రైల్లో! స్టేషను వస్తోంది. నేను దిగిపోవాలి ఇప్పుడు.

నాగ్‌పూరు వచ్చేసింది. గీతాంజలి ఆగింది. ఆ ఆంధ్రా తండ్రీ, కూతురూ ముందు వెడుతున్నారు. వెనకాల నేను! తండ్రి దిగాడు. కూతురు దిగాలి.

ఎదురుగా పొడుగ్గా, మంచి స్టైల్లో నిలబడ్డాడొక యువకుడు. ఆ అమ్మాయి దిగబోతోంది. పడిపోయిందేమో అనుకున్నాను. ఆ అబ్బాయి కౌగలిలో వుంది.

''సీతా మై డాలింగ్'' అంటున్నాడు. ముద్దు పెట్టేసుకున్నాడు.

సీత సిగ్గుపడలేదు. ముడుచుకోలేదు. గర్వంగా నవ్వింది. అతడి చెయ్యి పట్టుకుని నడుస్తోంది వెనక్కి తిరిగి చూడకుండా. తండ్రి కూలీతో బేరమాడుతున్నాడు.

''సీత! నువ్వు కూడానా!'' నిర్ఘాంతపోయాను. తెలివి తెచ్చుకుని దిగాను. తండ్రి నొసలు చిట్లించి నోటితో నవ్వుతూ నావైపుచూసి.

''ఈ కాలం పిల్లలండి!'' అన్నాడు సంజాయిషీ ఇస్తున్నట్లు... తను అర్థం చేసుకున్నట్లు.

కిటికీ దగ్గర సునీ ఉంది. మొహం తెల్లబోయింది. అరవ కుర్రాడిది కూడా.

ముద్దబంతిలాగ ముడుచుకు కూర్చున్న పిల్ల ఇట్లాగ చేసిందేమిటా అని ఆశ్చర్యం కాబోలు వాళ్ళకి కూడా.

ఒప్పుకోవాలి. నేను తెల్లబోయాను. ఇంకా తెల్లబోతూనే ఉన్నాను.

ఆంధ్రజ్యోతి వారపత్రిక

18–7–1980

* * * *